'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

అయోధ్యపై కాంగ్రెస్ డైలమా

టంకశాల అశోక్

అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవానికి తాము రాలేమని కాంగ్రెస్ అగ్రనేతలు ప్రకటించి ఉండవచ్చు గాక. అంతమాత్రాన ఈ అంశంపై గాని, విస్తృతస్థాయిలో హిందూ మతం,సెక్యులరిజం విషయాలపై గాని, ఆ పార్టీని చిరకాలంగా వేధిస్తున్న ప్రశ్నల పట్ల తమకు ఒక స్పష్టత వచ్చినట్టు భావించలేం. ముస్ముందు రాగల సూచనలు కూడా కన్పించటం లేదు.ఎందుకంటే, వీటిచుట్టూ అల్లుకొని కొన్ని ఇతర మౌలిక సమస్యలు కూడా ఉన్నాయి. ఆ విధంగా ఇది కేవలం అయోధ్యకు పరిమితమైన డైలమా కాదు.

అయోధ్య గురించిన చర్చ ఎప్పటినుంచో ఉన్నదే అయినా, తమకు అందిన ఆహ్వానంపై కాంగ్రెస్ నాయకత్వం వెంటనే ఒక నిర్ణయం తీసుకోలేకపోయింది. దానినిబట్టే ఈ విషయమై పార్టీకి ఒక డైలమా ఎదురైనట్టు అందరికీ అర్థమైంది. కాంగ్రెస్ తనను తాను సెక్యులర్‌గా ప్రకటించుకున్నందున వాస్తవానికి ఎటువంటి డైలమా ఉండకూడదు. అయోధ్య ఆహ్వానం రాగలదన్నది ముందే తెలిసిన విషయమైనప్పుడు, నిర్ణయం కూడా ఎంతో ముందుగానే తీసుకొని ఉండవలసింది. కానీ, ఆ పని ఎందుకు చేయలేకపోయింది? చివరికి, తాము రామునికి గాని, ఆలయానికి గాని వ్యతిరేకం కాదని, ఆ కార్యక్రమాన్ని బీజేపీ ఒక రాజకీయ కార్యక్రమంగా మార్చినందున, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో లాభపడజూస్తున్నందున, ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నామని వివరించబూనింది.

అయోధ్య కార్యక్రమాన్ని బీజేపీ రాజకీయం చేయటం, ఎన్నికల కోసం ఉపయోగించుకొనజూడటం నిజం. అందులో రహస్యం లేదు, కొత్త విషయం కూడా లేదు. వారు అయోధ్యను కేంద్రం చేసుకొని గాని, హిందూ మత సంబంధమైన అనేక ఇతర అంశాలను ఉపయోగించుకుంటూ గాని ఈ తరహా పనులు కొన్ని దశాబ్దాలుగా చేస్తున్నారు. అంతిమంగా హిందూ రాష్ట్ర స్థాపన తమ లక్ష్యమని బీజేపీ అధికారికంగా ప్రకటించకపోయినా (అందుకు రాజ్యాంగ పరిమితులు, చట్టపరమైన పరిమితులున్నందున), ఆ పార్టీ మాతృసంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం వందేండ్లుగా అదే. గతంలో జనసంఘ్, తర్వాత బీజేపీ చేస్తున్నది రాజ్యాధికారాన్ని ఉపయోగించుకొని అందుకు మార్గాన్ని సుగమం చేస్తూ పోవటమే. ఇదంతా కాంగ్రెస్‌కు సైతం మొదటినుంచీ తెలుసు. అదే అజెండాను బీజేపీ ఇప్పుడు అయోధ్య అనే సాధనం ద్వారా మరికొంత ముందుకు తీసుకుపోజూస్తున్నది. సెక్యులరిజం అనే దృక్పథాన్ని, ఆ పేరిట కాంగ్రెస్‌తో సహా అనేక మధ్యేమార్గ పార్టీలు, వామపక్షాలు తీసుకునే వైఖరులను బాహాటంగా ఖండిస్తున్నది.

ఇదంతా మనం చిరకాలంగా చూస్తున్నదే. అదే స్థితి ఇప్పుడు అయోధ్య సందర్భంగా మరొకసారి ముందుకువస్తున్నది. అయితే, దీనంతటికి భిన్నంగా కాంగ్రెస్ చెప్తూ వస్తున్నది, చేస్తూ వస్తున్నది ఏమిటి? సెక్యులరిజాన్ని నిలబెట్టడానికి గాని, హిందూ మతతత్త్వ భావనలు వ్యాపించకుండా నిరోధించేందుకు గాని వారి వ్యూహం ఏమిటి? ఆ ప్రకారం చేసిన ఆచరణలు ఏమిటి? అన్నవి ఆలోచించవలసిన ప్రశ్నలు. అవి అర్థమైతే తప్ప, కాంగ్రెస్ డైలమాలు, సంకట పరిస్థితులు, తరచూ కనిపించే తడబాట్లు, ద్వంద్వనీతి మనకు అర్థం కావు.

కాంగ్రెస్ పార్టీ తమది సెక్యులర్ విధానమని మొదటనే ప్రకటించింది. తర్వాత ఆ మాటను రాజ్యాంగంలో చేర్చింది. అంతవరకు పార్టీ విధానం పూర్తిగా సమర్థించదగినదే. దేశ జనాభా స్థితిగతులను బట్టి, దేశ విభజన పరిస్థితులను బట్టి, దేశం ఆధునిక ప్రజాస్వామ్య మార్గంలో పురోగమించవలసిన లక్ష్యాలను బట్టి అది సరైన నిర్ణయమే. కానీ, సెక్యులరిజం అనే మాటను నిర్వచించటంలో, ఆచరించటంలో తొలుతనే సమస్యలు ఎదురయ్యాయి. మనది మతాతీత వ్యవస్థా లేక, సర్వమత సమభావనా వ్యవస్థా అన్నది మొదటి చర్చ అయింది. ఆ చర్చల వివరాల్లోకి పోలేము గాని మొత్తానికి అదొక అస్పష్ట నిర్వచనంగా మిగిలిందని గుర్తించాలి. ఆ కారణంగా ఆచరణ కూడా అస్పష్టమైన విధంగానే సాగింది. ఇందువల్ల అసలు సమస్య ఎక్కడ వచ్చిందంటే, మనది ఎవరు అవునన్నా కాదన్నా హిందూ మెజారిటీ దేశం అయినందున, ఈ అస్పష్టతలు క్రమక్రమంగా కాంగ్రెస్ డైలమాలకు, బీజేపీకి పరిస్థితులు అనుకూలం కావటానికి వీలు కల్పించాయి.

యథాతథంగా ఈ నిర్వచన అస్పష్టతలు, ఆ ప్రకారం ఆచరణ అస్పష్టతలు ఇందుకు ఒక కారణమైతే, అంతకన్న అనేక రెట్లు కారణమైన విషయం మరొకటి ఉంది. అది, మన దేశంలో సెక్యులరిజం అనేది సరైన పునాదులపై నిలబడేందుకు, బలంగా నిర్మాణమయ్యేందుకు చేయవలసిందేమిటనే అవగాహన గాని, వ్యూహం గాని, అందుకు తగిన ఆచరణగాని కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ లేవు. ఇటువంటి అవగాహనకు, వ్యూహానికి, ఆచరణకు ఇరుసుగా పనిచేసే అతి కీలకమైన అంశం అన్నివర్గాల అభివృద్ధి, అన్నివర్గాల సంక్షేమం, సమర్థవంతమైన పరిపాలన. కాంగ్రెస్ నాయకత్వం ఈ విషయాల్లో విఫలం కావటానికి, అందుకు పర్యవసానంగా సెక్యులర్ ప్రకటనల వైఫల్యానికి అవినాభావ సంబంధం ఉన్నది. ఈ వైఫల్యాలన్నింటి ఫలితంగా అన్ని విధాలుగానూ ఒక పెద్ద శూన్యం ఏర్పడి, ఆ శూన్యంలోకి బీజేపీ విజయవంతంగా ప్రవేశించింది.

వరుసగా కొన్ని దశాబ్దాల పాటు పరిపాలించి కూడా కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమాలే మౌలికంగా అరకొరగా మిగిలాయి. కనుక అన్నివర్గాల అభివృద్ధి అనేది గాని, అన్నివర్గాల సంక్షేమం అన్నది గాని కూడా అరకొరగానే ఉండిపోయాయి. మరొకవైపు సమర్థవంతమైన పరిపాలనా లేకపోయింది. ఇవి చాలవన్నట్టు విపరీతమైన అవినీతి, నిరుద్యోగం, పేదరికం, పైనుంచి కిందివరకు దోపిడీ. ఈ స్థితికి, సెక్యులరిజానికి, బీజేపీ బలోపేతం కావటానికి గల కార్యకారణ సంబంధాన్ని సూక్ష్మంగా ఒక మాటలో చూద్దాం. అభివృద్ధి, సంక్షేమం, పరిపాలనా వైఫల్యాల చెడు ప్రభావాలు హిందువులపై, ముస్లింలపై కూడా ఉన్నాయి. మతాలతో సంబంధం లేకుండా అందరిపై గల ప్రభావాల గురించి అనేక అధ్యయనాలున్నాయి. ముస్లింల విషయమై జస్టిస్ రాజేంద్ర సచార్ ప్రత్యేక నివేదిక ఉన్నది. అయినప్పటికీ తమ వెనుకబాటుకు కాంగ్రెస్ తదితర పార్టీలు ముస్లింలను 'బుజ్జగించట'మే కారణమని హిందువులను నమ్మించేందుకు బీజేపీకి మంచి అవకాశం లభించింది. అందుకు సెక్యూరిటీ అంశాలు, కశ్మీర్, పాకిస్థాన్ వంటివి కూడా వారికి కలిసివచ్చాయి.

వీటికి వేటికీ కాంగ్రెస్ వద్ద సమాధానాలు లేకపోయాయి. ఎప్పుడైనా, ఏ సమాజంలోనైనా మతం, జాతీయత, దేశ భద్రత అనే మూడు కూడా బలమైన అంశాలు. ఇంగ్లీషు మాటల్లో చెప్పాలంటే బేసిక్ ఇన్‌స్టింక్ట్స్ వంటివి. ఈ మూడింటిలో కాంగ్రెస్ పరిస్థితి గానీ, సెక్యులర్ విధానం గానీ ప్రజల్లో బలంగా పాదుకొనాలంటే అన్నింటికి ముందు జరగవలసింది ప్రజలందరినీ అభివృద్ధి, సంక్షేమం, పరిపాలన విషయాల్లో సంతృప్తిగా ఉంచటం. ఇంచుమించు అన్నింటికి, దాదాపు అన్ని పరిస్థితుల్లో అదే పునాది అవుతుంది. అసాధారణ పరిస్థితులు ఏవైనా తలెత్తితే తప్ప. కానీ కాంగ్రెస్ వరుస వైఫల్యాలు మనకు తెలిసినవే.

ఈ వైఫల్యాల వల్లనే ఆ పార్టీ పరాజయాలు నెహ్రూ జీవించి ఉన్నప్పుడు 1957 ఎన్నికల నుంచే మొదలయ్యాయి. 1960లలో శ్రామికులు, యువకుల అశాంతి, నక్సలిజం, 1970లలో ప్రాంతీయ పార్టీల రాక, ఎమర్జెన్సీ వంటివాటితో మరిన్ని కాంగ్రెస్ పరాజయాలు నమోదయ్యాయి. గమనించదగినదేమంటే, ఈ ప్రతికూల పరిస్థితుల్లో ఎన్నికల గెలుపు ఒక జీవన్మరణ సమస్యగా మారిన కాంగ్రెస్ పార్టీ నిజంగానే ముస్లింల బుజ్జగింపు విధానాన్ని అనుసరించింది. వాస్తవానికి చేయవలసింది అభివృద్ధి, సంక్షేమం, పరిపాలనా రంగాలలో గల వైఫల్యాలను సరిదిద్దుకొని హిందువులు, ముస్లింలనే తేడా లేకుండా అందరినీ బాగు పరచటం. అందరి మద్దతు సంపాదించటం. ఆ విధంగా సెక్యులరిజాన్ని కూడా నిలబెట్టడం. కానీ ఆ పనిచేయలేదు. విచిత్రం ఏమంటే, ఎన్నికల భయంలో ఒకవైపు ముస్లింల బుజ్జగింపుతో వారిని ఓటు బ్యాంకుగా మార్చుకొనజూస్తూ, దానిపై విమర్శలు రావటంతో హిందువుల ఓట్ల కోసం భయపడి సాఫ్ట్ హిందూత్వ కార్డును ఉపయోగించటం కూడా మొదలుపెట్టారు. అదొక డబుల్ గేమ్ అయి క్రమంగా రెండూ దెబ్బతీసాయి. బుజ్జగింపు గురించిన విమర్శలను బీజేపీ చేయగా, కొన్నాళ్లకు స్వయంగా ముస్లింలు కూడా కాంగ్రెస్ తమ అభివృద్ధికి చేయవలసింది చేయక బీజేపీ బూచిని చూపి ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నదని ఆక్షేపించసాగారు.

ఈ వైఫల్యాలు, డైలమాలు, ఎన్నికల భయాల మధ్య రాజీవ్‌గాంధీ ప్రభుత్వం అటు బుజ్జగింపులు, ఇటు సాఫ్ట్ హిందూత్వ చక్రాల మధ్య నలుగుతూ అయోధ్య ఆలయం తాళాలు తెరిపించింది. శిలాన్యాస్‌ను అనుమతించింది. మరొకవైపు షా బానో కేసులో ముస్లింల బుజ్జగింపును పరాకాష్ఠకు తీసుకువెళ్లింది. చివరికి ఎవ్వరినీ సంతోషపెట్టలేక బోర్లా పడింది. హిందువులు బీజేపీ వైపు మళ్లటం మొదలవగా, ముస్లింలు కుల పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, నేషనల్ ఫ్రంట్ వంటి జాతీయ వేదికల వైపు చూడసాగారు. కాంగ్రెస్ పాలనలోనే బాబ్రీ విధ్వంసం ఈ పరిణామాలకు మరొక పరాకాష్ఠ అయింది.

ఈ దశాబ్దాల కాలపు నూటొక్క వైఫల్యాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఈ రోజుకు కూడా కోలుకోలేదు. ఇప్పటికీ వారికి సెక్యులరిజం నిర్వచనంపైగాని, దాని ఆచరణపై గాని స్పష్టత లేదు. అందరి అభివృద్ధి, అందరి సంక్షేమం, సమర్థవంతమైన పాలనపై విధానాలు లేవు, చిత్తశుద్ధి లేదు. ఓట్ల కోసం రకరకాల సరికొత్త డ్రామాలు తప్ప. అయోధ్యపై నాయకత్వానిది డైలమా, అస్పష్టత అయితే అదే పార్టీ నాయకులు వేర్వేరు స్వరాలతో మాట్లాడుతుండటం వెనుక ఈ విధమైన దశాబ్దాల వైఫల్యాలు మూల కారణంగా ఉన్నాయి. పార్టీ ప్రస్తుత నాయకత్వం బలహీనమైనది గనుక ఈ చారిత్రక వైఫల్యాలు కాంగ్రెస్‌ను భవిష్యత్తులోనూ వెంటాడుతూనే ఉంటాయి.

మాల్దీవులకు మన దేశానికి మధ్య వివాదం చెలరేగిన నాటి నుంచి మన దేశంలోని కేంద్రపాలిత ప్రాంతం లక్షద్వీప్ నిత్యం వార్తల్లో నిలుస్తున్నది. ప్రధాని మోదీ అక్కడ పర్యటించడంతో ఒక్కసారిగా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిపోయింది. లక్షద్వీప్ బీచ్‌లో కుర్చీ వేసుకొని మోదీ కూర్చున్న ఫొటో ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేయడంతో తమ దేశ పర్యాటకం ఎక్కడ దెబ్బతింటుందోననే భయంతో మాల్దీవుల మంత్రులు వెంటనే స్పందించారు. మోదీతో పాటు మన దేశంపై వారు చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలు 'బాయ్‌కాట్ మాల్దీవులు'కు దారితీశాయి. మన సెలబ్రిటీలు ఇచ్చిన 'మాల్దీవులు వద్దు.. లక్షద్వీప్ ముద్దు' నినాదంతో మాల్దీవుల వివాదాన్ని నెపంగా చూపి బలవంతంగా లక్షద్వీప్ వైపునకు అందరి దృష్టిని మళ్లించారు.

బీజేపీ ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రుల రంగప్రవేశంతో ఈ అంశం రాజకీయ రంగు పులుముకొని 'దేశభక్తి' నినాదం తెరపైకి వచ్చింది. ఈ దెబ్బతో మాల్దీవులకు వెళ్లాలని ప్రణాళికలు వేసుకున్న వేల మంది భారతీయ పర్యాటకుల చూపు లక్షద్వీప్‌పై పడింది. మన కేంద్రపాలిత ప్రాంతం బలవంతంగా మాల్దీవులకు ప్రత్యామ్నాయంగా మారిపోయింది. విమానాలు, హోటళ్లు నిండిపోయాయి. దీంతో సందట్లో సడేమియాలాగా హోటళ్లు, విల్లాలు నిర్మించి.. పర్యాటకులకు వసతులు కల్పిస్తామని కార్పొరేట్ కంపెనీలు ప్రకటించేశాయి. అంతాబాగానే ఉన్నది. కానీ, వెల్లువలా వచ్చిపడుతున్న పర్యాటకులను తట్టుకునే సామర్థ్యం లక్షద్వీప్‌కు ఉందా? అసలక్కడ సరైన వసతులున్నాయా? అక్కడి సహజ సంపద, జీవావరణం పరిస్థితి ఏమిటి? అనే అంశాలను ఎవరూ పట్టించుకోకపోవడం ఆందోళనకరం.

పర్యాటకానికి పనికొస్తుందా?

మాలోతు సురేష్
98856 79876

మాల్దీవులు మన పొరుగునున్న దేశం. చేపల వేట, పర్యాటకంపైనే ఎక్కువగా ఆధారపడే ఆ దేశానికి ఏటా 2 లక్షల మందికిపైగా భారతీయులు వెళ్తుంటారు. ఆ దేశ జీడీపీలో 28 శాతం పర్యాటకం నుంచే వస్తున్నది. అందుకే మొదటి నుంచి మాల్దీవులు పర్యాటకానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నది. మన దేశంతోపాటు రష్యా, చైనా, జపాన్ తదితర దేశాల నుంచి వచ్చే లక్షల మంది పర్యాటకులకు సరిపడేలా సకల వసతులు అక్కడ ఉన్నాయి. పైగా మాల్దీవులు 1,200 దీవుల సమూహం. 9 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల 26 అటోల్స్ ఉన్నాయక్కడ. మరి మాల్దీవులతో పోటీగా కార్పొరేట్ల లబ్ధి కోసం బలవంతంగా తెరపైకి తెస్తున్న మన లక్షద్వీప్‌కు ఆ స్థాయిలో సామర్థ్యం ఉందా? అంటే అవునని చెప్పలేని పరిస్థితి. మాల్దీవులతో మన లక్షద్వీప్‌ను పోల్చడం మూర్ఖత్వమే అవుతుంది. ఎందుకంటే, లక్షద్వీప్ మొత్తం విస్తీర్ణం 32 చదరపు కిలోమీటర్లు మాత్రమే. లక్షద్వీప్‌లో 36 దీవులే ఉన్నాయి. వాటిలో 11 దీవుల్లోనే ప్రజలు నివసిస్తున్నారు. వాటిలోనూ 4-5 దీవులు మాత్రమే పర్యాటకానికి అనుకూలంగా ఉంటాయి.

మన సెలబ్రిటీలు ఇచ్చిన 'బాయ్‌కాట్ మాల్దీవులు' పిలుపుతో వేలాదిగా తరలుతున్న పర్యాటకులకు లక్షద్వీప్‌లో ఉన్నపళంగా వసతి కల్పించడం ఎంత కష్టంతో కూడుకున్నదో ఒక్కసారి ఊహించుకోండి. సుమారు 60 వేలమంది నివసించే లక్షద్వీప్‌లో మనకు దొరికినట్టు తాగునీరు దొరకదు. రోజువారీ అవసరాల కోసం సముద్రపు నీటిని శుద్ధి చేస్తారు. వేసవిలో అక్కడ గుక్కెడు తాగునీరు బంగారంతో సమానం.

లక్షద్వీప్‌లో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ సరిగా ఉండదు. సువిశాలంగా ఉండే పెద్ద పెద్ద రాష్ర్టాల్లోనే వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ సరిగ్గా లేక అవి నానా అవస్థలు పడుతుంటాయి. మరి అతిచిన్న లక్షద్వీప్‌లో పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. స్థానికుల ద్వారా వెలువడే వ్యర్థాలను శుద్ధి చేయడమే ప్రస్తుతం అక్కడ ఇబ్బందికరంగా ఉన్నది. లక్షల మంది పర్యాటకులు వదిలిపెట్టే వ్యర్థాల నిర్వహణ ఎలా అనేది ప్రశ్నార్థకమే.

మరోవైపు లక్షద్వీప్ మొత్తంలో అగత్తిలో ఒకేఒక్క స్పెషాలిటీ దవాఖాన ఉన్నది. కవరత్తి, మినికాయ్‌లో ఒక్కో దవాఖాన ఉన్నది. మిగతా ప్రాంతాల్లో ప్రైమరీ హెల్త్‌కేర్ సెంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. దీంతోపాటు లక్షద్వీప్‌లోని కవరత్తి, కాల్పెనిలో మాత్రమే ఇంధన స్టేషన్లు ఉన్నాయి. అగత్తిలో పెట్రోల్ పంప్ అందుబాటులో లేదు. రేషన్ సరుకులను పంపిణీ చేసినట్టుగా.. అక్కడ మత్స్య శాఖ పెట్రోల్‌ను పంపిణీ చేస్తుంది. టూవీలర్లకు నెలకు 10 లీటర్లు, ఫోర్ వీలర్లకు నెలకు 15 లీటర్లు మాత్రమే అందిస్తారు. పర్యాటకుల సంఖ్య పెరిగితే.. ఇంధన కొరత ఏర్పడే ప్రమాదం లేకపోలేదు.

ఇక రవాణా విషయానికి వస్తే.. లక్షద్వీప్‌కు చేరుకోవాలంటే కోచి నుంచి మాత్రమే రవాణా వసతులున్నాయి. కోచి నుంచి 496 కిలోమీటర్ల దూరంలోని లక్షద్వీప్‌కు జల, వాయు మార్గాల్లోనే చేరుకోవాలి. లక్షద్వీప్‌లోని ఏకైక విమానాశ్రయం అగత్తిలో ఉన్నది. అక్కడికి వెళ్లాలంటే రోజుకు ఒకటే విమానం అందుబాటులో ఉంటుంది. మూడు నౌకలే ఉంటాయి. అది కూడా నౌకల్లో సుమారుగా 15 గంటల పాటు ప్రయాణిస్తేనే అగత్తికి చేరుకోగలం. ఈ కారణాల వల్ల భారతీయులు తప్పితే విదేశీయులు అక్కడికి వెళ్లే పరిస్థితులు లేవు. వేలాదిగా పర్యాటకులు వస్తున్నారని.. వారికి తగ్గట్టుగా వసతులు కల్పించడం కూడా అసాధ్యమే. అక్కడి భౌగోళిక పరిస్థితులు అందుకు అనుకూలించవు. 6 కిలోమీటర్ల పొడవు, 1 కిలోమీటర్ వెడల్పు, 3.84 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉండే అగత్తిలో రవాణా సదుపాయాలు మెరుగుపరచడం అంత తేలికైన విషయం కాదు. విమానాశ్రయాన్ని విస్తరించాలన్నా.. పెద్ద నౌకల రాకకు అనుకూలంగా తీరంలో సదుపాయాలు కల్పించాలన్నా చాలా వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారం. నౌకాశ్రయాన్ని విస్తరిస్తే సముద్ర జీవులు బలవుతాయి. లక్షద్వీప్ ప్రజల ప్రధాన వృత్తి చేపల వేట. చేపలు నశించి స్థానికులు ఉపాధికి దూరమవుతారు. సహజసిద్ధమైన అక్కడి బీచ్‌లు సహజత్వాన్ని కోల్పోతాయి. పగడపు దిబ్బలు ఉనికి లేకుండా పోతాయి. అదే సమయంలో భారీగా విమానాలను నడిపితే.. కార్బన్‌డైఆక్సైడ్‌తో పాటు ఇతర కాలుష్య కారకాలు వెలువడతాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా భూతాపం కారణంగా అనేక ద్వీపదేశాలు కనుమరుగయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. సముద్ర మట్టానికి 1-2 మీటర్ల ఎత్తులో ఉన్న లక్షద్వీప్ కూడా సముద్ర జలాల్లో కలిసిపోయే ఆస్కారం ఉన్నది. సుమారు 50 ద్వీప దేశాలకు ఈ ప్రమాదం పొంచి ఉందని ఐక్యరాజ్య సమితి సైతం ఆందోళన వ్యక్తం చేసింది. ఎవరో, ఎక్కడో వెలువరించే కాలుష్యం కారణంగా అమాయక దేశాలు బలిపీఠమెక్కుతున్నాయి. ఈ జాబితాలో మన లక్షద్వీప్ చేరకూడదంటే.. మనం ఇప్పటినుంచే తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

లక్షలాదిగా తరలివచ్చే దేశంలోని వివిధ ప్రాంతాల పర్యాటకుల కారణంగా అక్కడి సంస్కృతి కూడా దెబ్బతింటుంది. లక్షద్వీప్ జనాభాలో 90 శాతానికిపైగా ముస్లింలే ఉన్నారు. గుజరాత్‌కు చెందిన ప్రఫుల్ పటేల్ లక్షద్వీప్ అడ్మినిస్ట్రేటర్‌గా బాధ్యతలు చేపట్టాక పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. పాఠశాలల్లో మిడ్‌డే మీల్స్‌లో మాంసాహారం పెట్టకుండా ఆయన నిబంధనలు తీసుకొచ్చారు. దీనిపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. పర్యాటకులు పెరిగితే ఆదాయం పెరుగుతుందనేది వాస్తవమే. కానీ, ఆదాయంతో పాటు అనేక అనర్థాలు జరుగుతాయనేది జగమెరిగిన సత్యం. గోవానే దీనికి ఉదాహరణ. దేశ విదేశాల నుంచి గోవాకు పోటెత్తుతున్న పర్యాటకుల కారణంగా సహజ అందాలకు నెలవైన 1960ల నాటి గోవా కనుమరుగైంది. ఆ రాష్ట్రం మాదకద్రవ్యాలకు అడ్డాగా మారింది. పబ్‌లు, హుక్కా సెంటర్లు, వ్యభిచార కూపాలకు నెలవుగా తయారైంది.

మాల్దీవులతో వివాదాన్ని సాకుగా చూపి దేశంలోని కార్పొరేట్ కంపెనీలు లక్షద్వీప్‌పై కన్నేశాయి. వాటికి సామాన్య ప్రజల ఇబ్బందులు, అవసరాలు, సంస్కృతులతో సంబంధం ఉండదు. వ్యాపారమే కార్పొరేట్ కంపెనీల లక్ష్యం. లక్షద్వీప్‌కు ఉండే సహజ లక్షణాలను నామరూపాల్లేకుండా చేసైనా సరే కోట్లు సంపాదించడమే వాటికి కావాల్సింది. కార్పొరేట్ కంపెనీలు, రాజకీయాల మాయలో పడి మనమూ ముందూవెనుకా ఆలోచించడం లేదు. సెలబ్రిటీలు పిలుపునివ్వగానే అక్కడి పరిస్థితులను బేరీజు వేసుకోకుండానే విమానమెక్కుతున్నాం. లక్షద్వీప్‌కు విమాన టిక్కెట్లే దొరకడం లేదు. మార్చి చివరి వరకు టిక్కెట్లన్నీ బుక్ అయిపోవడమే దీనికి నిదర్శనం.

మోదీ ప్రధాని అయ్యాక సరిహద్దు దేశాలన్నీ మనకు దూరమయ్యాయి. శ్రీలంక, పాక్, భూటాన్, నేపాల్, అఫ్గానిస్థాన్ తదితర దేశాలు ఎప్పుడో చైనా పంచన చేరాయి. తాజాగా మాల్దీవులు ఆ బాట పట్టింది. ప్రస్తుతం ఒక్క బంగ్లాదేశ్ మాత్రమే మనతో సఖ్యతతో వ్యవహరిస్తున్నది. మన అనాలోచిత విదేశాంగ విధానమే దీనికి ప్రధాన కారణం. లక్షద్వీప్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం మంచిదే. కానీ, అక్కడి భౌగోళిక పరిస్థితులు, జీవావరణం, సంస్కృతులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అలాకాకుండా మాల్దీవులతో వివాదం చెలరేగిందనే కారణంగా కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో బలవంతంగా, హడావుడిగా లక్షద్వీప్‌ను పర్యాటక హబ్‌గా మార్చడం సరైనది కాదు. దానివల్ల అనేక అనర్థాలు జరుగుతాయి. ఇకనైనా విచక్షణతో ఆలోచిద్దాం. లేదంటే.. కార్పొరేట్ల లబ్ధి కోసం జరుగుతున్న రాజకీయ క్రీడలో మనం పావులుగా మారి లక్షద్వీప్‌ను బలి చేసినవారిగా చరిత్రలో మిగిలిపోతాం.

అధికార మదపు మాటలు

జక్కు వెంకట్ రెడ్డి
98858 09367

'కేటీఆర్ డ్యూప్లికేట్... నేను ఒరిజినల్' దావోస్ పర్యటనలో విలేకరి అడిగిన ఓ ప్రశ్నకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానం.

'రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నిశాన లేకుండా 100 మీటర్ల గోతి తీసి పాతిపెడుతా' లండన్ పర్యటనలో భాగంగా టీడీపీ సానుభూతి పరులు ఏర్పాటుచేసిన ఓ సమావేశంలో సీఎం చేసిన వ్యాఖ్యలు ఇవి.

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికి 48 రోజులు అవుతున్నది. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం' లాంటి ఓ అంతర్జాతీయ వేదికపై రాష్ట్రంలో ఉన్న వనరులను చూపించి అంతర్జాతీయ పెట్టుబడులను ఆహ్వానించాలి. కానీ సీఎం హోదాలో పాల్గొన్న ఒక వ్యక్తి 'కేటీఆర్ డ్యూప్లికేట్.. నేనే ఒరిజినల్' అని తనకు తానే ప్రకటించుకోవడం నిజంగా అనైతికం. కేసీఆర్ స్థాపించిన బీఆర్‌ఎస్ గుర్తును 100 మీటర్ల లోతులో బొంద పెడుతానని ఆ వేదికపై విర్రవీగితే తెలంగాణ రాష్ర్టానికి పెట్టుబడులు వస్తాయా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపై గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇంత నీచంగా మాట్లాడిన సందర్భాలు లేవు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా.. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అనే నినాదంతో స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితిని భూ స్థాపితం చేస్తానని శపథం చేసిన రేవంత్‌రెడ్డి గురువు చంద్రబాబు పార్టీ తెలంగాణలో భూ స్థాపితమైంది. ఆ తర్వాత వచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి టీఆర్‌ఎస్‌ను శాశ్వతంగా తుడిచేస్తానని శపథం చేశారు. చివరికి ఏమైందో ప్రజలకు తెలుసు. ఆ తర్వాత రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి కూడా రేవంత్ కంటే ఎక్కువే మాట్లాడారు. కానీ వాళ్లు ఈ రోజు ఎక్కడున్నారో నా కంటే రేవంత్‌కే ఎక్కువ తెలుసు. రేపు రేవంత్ పరిస్థితి ఏమిటనేది కాలమే నిర్ణయిస్తుంది. కానీ, అధికారం వచ్చిన నెలన్నర రోజులకే కండ్లు అందలమెక్కితే ఎలా?

రేవంత్‌రెడ్డీ... మీరొక విషయం గుర్తుంచుకోవాలి. కేసీఆర్‌ను, కేసీఆర్ పార్టీని 100 మీటర్ల లోతులో పాతి పెట్టాలని చూడటమంటే.. కేసీఆర్ పదేండ్లలో నిర్మించిన తెలంగాణ భవిష్యత్తును మీరు వందేండ్లు వెనక్కి తీసుకువెళ్లడమే అవుతుంది. ఎందుకంటే.. పరాయి పాలకుల చేతిలో అచేతనంగా మారిన తెలంగాణకు ఊపిరిపోసి సీమాంధ్రుల వద్ద బానిసలుగా ఉన్న మీకు స్వపరిపాలన రుచి చూపించింది కేసీఆరే అనే విషయం మరిచిపోకండి. మీరు రాదన్న తెలంగాణను తెచ్చినందుకా బీఆర్‌ఎస్‌ను 100 మీటర్ల లోతులో పాతిపెట్టేది?

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ చీకట్లను పారదోలి 24 గంటలు దేదీప్యమానంగా మార్చారు. మీరు, మీ గురువు దండుగన్న వ్యవసాయాన్ని కేసీఆర్ పండుగ చేశారు. పశువులకు గడ్డి లేని తెలంగాణను దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మార్చారు. తాగునీరు లేని తెలంగాణలో గడపకు గడపకు గోదావరి నీటిని మళ్లించారు. తెలంగాణను ఫ్లోరోసిస్ ఫ్రీగా మార్చారు. రాష్ట్ర రైతులకు కాళేశ్వరం జలాలను హక్కుగా మార్చారు. హరితహారంతో ఆకుపచ్చని తెలంగాణను ఆవిష్కరించారు. మత కలహాలకు నిలయమైన హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మించి తెలంగాణను శాంతిభద్రతలకు నిలయంగా, విశ్వనగరంగా మార్చారు. హైదరాబాద్ మెడలో హారం వలే ఔటర్ రింగు రోడ్డును పూర్తి చేశారు. పల్లె పల్లెకు పక్కా సడక్‌లు నిర్మించారు. మెట్రోను పూర్తిచేసి ప్రజా రవాణాను మెరుగుపర్చారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకు తోడుగా హార్టికల్చర్ యూనివర్సిటీ, ఫారెస్ట్ యూనివర్సిటీలతో పాటు జిల్లాకో యూనివర్సిటీని ఏర్పాటుచేశారు.

గత పదేండ్లలో ప్రజలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి పల్లెలో మత్స్య విప్లవం వచ్చింది. ప్రతి నియోజకవర్గానికి ఓ గురుకులం వచ్చింది. రాష్ట్ర ఆదాయ పరిమితి పెరిగింది. రూపాయికే నల్లా వచ్చింది. ప్రభుత్వమే ధాన్యం కొన్నది. సకాలంలో ఎరువులు అందినయి. విత్తన కల్తీపై పీడీ చట్టం, రామగుండం ఫర్టిలైజర్స్ పునరుద్ధరణతో పాటు రాష్ట్రంలోని సబ్బండ జాతుల సంక్షేమం, పదేండ్ల తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో పరిఢవిల్లుతున్నది. వీటన్నింటికి కారణం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాదా? ఆయన ప్రత్యేక తెలంగాణ కోసం స్థాపించిన టీఆర్‌ఎస్ పార్టీ కాదా? ఇవన్నీ మర్చిపోయి మీరు బీఆర్‌ఎస్‌ను 100 మీటర్ల లోతులో బొంద పెడుతామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరనే విషయాన్ని తెలుసుకోవాలి.

పెట్టుబడులను రాబట్టేందుకు దావోస్, లండన్ వెళ్లిన మీరు సాధించిన ప్రతి పైసా పెట్టుబడి కూడా కేసీఆర్ అమల్లోకి తీసుకువచ్చిన టీఎస్-ఐపాస్ కరప్షన్ ఫ్రీ అనుమతుల పేరు చెప్పి సాధించినవే అనే విషయాన్ని మరువద్దు. దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన ఇంగ్లీష్ భాషపై సోషల్ మీడియాలో కొందరు అవహేళన చేస్తున్నారు. ముఖ్యమంత్రికి భాషలతో పనేముందని రేవంత్‌కు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వత్తాసు పలుకుతున్నారు. అయితే అలాంటివాళ్లు బానిసత్వం నుంచి విముక్తి పొందితే వాస్తవాలు బోధపడుతాయి. చిన్న ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చేయాలంటే అనేక రకాల అర్హతలు, స్కిల్స్ ఉండాలని నిర్ణయించే సీఎంకు భాషపై పట్టు తప్పకుండా ఉండాల్సిందే. సుపరిపాలన అందించేందుకు భాష అవసరం లేదేమో కానీ, సుసంపన్న దేశాలను ఒప్పించి, మెప్పించి తెలంగాణకు పెట్టుబడులను తీసుకురావాలంటే కచ్చితంగా భాషపై పట్టు ఉండాల్సిందే. చివరగా... కేసీఆర్ పేరులోనే ఒక తెలియని రణం ఉన్నది. ఒక సమర నినాదం ఉన్నది. తెలంగాణ అనే పదానికి సంపూర్ణ సార్థకతను సమకూర్చిన యోధుడు కేసీఆర్. ఆయనపై, ఆయన స్థాపించిన పార్టీపై అవాకులు, చెవాకులు పేలితే తెలంగాణ సమాజం చూస్తూ కూర్చోదు. సమరశంఖం పూరిస్తుందనే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకోవాలి. అది ఆయనకే మంచిది.

(వ్యాసకర్త: మేయర్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్)